క్లుప్తంగా

వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాషా ఆధ్వర్యంలో హోలిస్టిక్ హాస్పిటల్ సహకారంతో శ్రీరాములపేట ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, జనరల్ సర్జరీ, ఇతర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

కాల్వల్లో పూడికతీత పనులు



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

ప్రొద్దుటూరు : పట్టణంలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించేందుకు ప్రధాన మురికి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు ఛానల్-1 కాలువలో ఆదివారం పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మడూరు కాలువ, కొత్తపల్లె -1, 2, ప్రొద్దుటూరు 1, 2 కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదన్నారు. ప్రస్తుతం అన్ని కాలువల్లో పూడిక తీత పనులు చేయిస్తున్నట్లు తెలిపారు.

డీఎస్పీకి ఫిర్యాదు

పోరుమామిళ్ల : పంచాయతీ నిధుల్లో అవినీతి జరిగిందని, స్మశాన స్థలం ఆక్రమించారని వార్త రాసిన విలేకరిని చంపుతామని బెదిరించడంపై ఆదివారం పోరుమామిళ్లకు వచ్చిన మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కాశినాయన మండలంలో విశాలాంధ్ర విలేకరిగా పని చేస్తున్న పుల్లూరు మహబూబ్‌బాషా చెన్నవరం సర్పంచ్ భర్త వెంకటరెడ్డి, వారి బంధువు భాస్కర్‌రెడ్డి విలేకరిని చంపుతామని బెదిరించడంతో నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు

పులివెందుల రూరల్ : ఈనెల 12న పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు సిబ్బంది విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అద్దాలమరిర బార్డర్ చెక్ పోస్ట్, అంబకపల్లె బార్డర్ చెక్ పోస్ట్, పార్నపల్లి బార్డర్ చెక్ పోస్టులతోపాటు కనంపల్లె చెక్ పోస్ట్, నల్లగొండువారిపల్లె, రాయలాపురం, చందమామ దాబా, అలవలపాడు రోడ్ సర్కిల్, ఎర్రిపల్లె చెక్‌పోస్టుల వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది వాహనాలను తనిఖీలు చేసిన తర్వాతే అనుమతిస్తున్నారు.

• ఘనంగా జ్యోతి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి



జ్యోతి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని అమృతానగర్‌లో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి జ్యోతిని తలపై ఉంచుకొని డప్పువాయిద్యాల మధ్య భక్తులు నృత్యం చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన ఈ వేడుక ఆదివారం ఉదయం వరకూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో బండారు సూర్యనారాయణ, పల్లానరసయ్య, వెంకటపతి, చౌడయ్య, దాసు, భక్తులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు హేయమైన చర్య



మాట్లాడుతున్న పూలే, అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పిచ్చయ్య

బద్వేలు అర్బన్ : దళితులపై దాడులు చేయడం హేయమైన చర్య అని పూలే, అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బండిజకరయ్య పేర్కొన్నారు. ఆదివారం ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దాడులు అధికమయ్యాయని అన్నారు. దళితుల రక్షణ కోసం ఉన్న చట్టాలను పాలకులు, అధికారులు సక్రమంగా అమలు చేయకపోవడంతోనే దళితులపై నిరంతరం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి దళితులపై దాడులు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో దళితులంతా ఏకమై ప్రతిదాడులు చేసే దానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ దళిత నాయకులు బి.కేశవయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శిఖామణి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పి.వెంకటరమణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

12న బహిరంగ వేలం

ప్రొద్దుటూరు : పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న దుకాణాలకు ఈ నెల 12న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాట వాయిదా పడగా.. 12న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గాంధీ రోడ్డులోని వసంతపేట షాపింగ్ కాంప్లెక్స్‌లోని 9 షాపులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన ఉన్న రెండు, టీబీ రోడ్డులోని కామిశెట్టి సుబ్బారావు టీబీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 23, పాత మార్కెట్‌లోని ఒక షాపు గది, 35 దుకాణాలకు నెలసరి బాడుగ ప్రాతిపదికపై మూడేళ్ల లీజుకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి

రాజుపాళెం : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ పంచాయితీ కార్యదర్శి ద్వారా సమస్యలు గుర్తించే కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని, తాగునీరు, పారిశుద్ధ్యం ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

ఉన్నతాధికారులకు నివేదిక

మండల సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ తెలిపారు. పీఆర్ డీఈ లక్ష్మీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉపాధి నిధుల ద్వారా 2024-25 ఏడాదికి గానూ 69 పనులకు రూ.7.10 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. కొర్రపాడు, వెలవలి గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు జడ్పీ నిధులు మంజూరయ్యాయన్నారు. ఏఓ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పసల్ బీమా కింద నమోదు చేసుకునేందుకు ఈ నెల 14వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు షాకీర్ ఆలీఖాన్, అరుణకుమారి, వేణుగోపాల్, హుసేన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బద్వేలు నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి మేనల్లుడు మృత్యుంజయరెడ్డి వివాహ రిసెప్షన్ వేడుకలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసానిఆదిత్యరెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బి.కోడూరు, కాశినాయన, కలసపాడు మండలాల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, సుదర్శన్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, వెంకటరామిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భజంత్రి చాపాటి శివయ్య మృతి



భజంత్రి శివయ్య కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న సిబ్బంది

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో భజంత్రిగా పనిచేస్తున్న చాపాటి శివయ్య(60) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. చాపాటి శివయ్య కొన్నేళ్లుగా వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో భజంత్రిగా పనిచేస్తున్నారు. ఆలయ చైర్మన్ వీరనారాయణ యాదవ్, ఈఓ శ్రీనివాసులు సిబ్బందితో కలసి ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులకు దహన సంస్కార ఖర్చులకు రూ.15వేలు అందజేశారు. శివయ్యకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. భజంత్రి మృతి చెందడం పట్ల సోమవారం ఆలయాన్ని శుద్ధి చేసి సంప్రోక్షణ తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాన్ని ప్రారంభిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



క్రీడా సామగ్రితో విద్యార్థులు, తల్లిదండ్రులు

పోరుమామిళ్ల : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సిద్దిపేట లయన్స్ క్లబ్ మెంబర్ దాసరిపల్లె జోజి, బద్వేలు ఎంఈఓ ప్రమీల, ఎంఈఓ డేవిడ్, ఫిజికల్ డైరెక్టర్ ఓబయ్య పేర్కొన్నారు. ఆదివారం అక్కలరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వారు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతమైన విద్యను అందిస్తున్నారని, మెరుగైన వసతులున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు హామీని నిలబెట్టుకోవాలి

మైదుకూరు : అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 117 జీఓను రద్దు చేసి హామీని నిలబెట్టుకోవాలని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు వై.రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కడప రోడ్డులో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేసి మాట్లాడారు. రాబోయే కాలంలో విద్య, ఉద్యోగ రంగ సంక్షేమం కోసం యూటీఎఫ్ పెద్ద ఎత్తున ఉద్యమ బాట పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల దౌర్జన్యం నశించాలి

ప్రొద్దుటూరు : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్న పోలీసుల దౌర్జన్యం నశించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోసామనోహర్ తెలిపారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ అన్యాయంగా వైఎస్సార్‌సీపీకి చెందిన దాదాపు 150 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదుచేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు చట్టాన్ని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. చట్టాలను తుంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రతి ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నిలక్లో గెలిచేది వైఎస్సార్‌సీపీనేనని స్పష్టం చేశారు.

• జోరుగా పత్తి పంట సాగు



ట్రాక్టర్‌తో పత్తి సాళ్లను తోలుతున్న రైతు

వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఎద్దులు, ట్రాక్టర్లు, కూలీల సాయంతో పత్తి విత్తనం నాటేస్తున్నారు. ప్రస్తుతం ధరలు అంతంత మాత్రంగా ఉండడం, ఖర్చు ఎక్కువవడంతో రైతులు కొందరే ఆసక్తి చూపుతున్నారు. మరింత మంది కోటి ఆశలతో విత్తనం వేస్తున్నారు.

– రాజుపాళెం



రాజుపాళెంలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

సమరశీల పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యం



యూటీఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

బద్వేలు అర్బన్ : రాజీలేని సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.శివప్రసాద్ పేర్కొన్నారు. యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద యూటీఎఫ్ పతాకాన్ని బద్వేలు మండల అధ్యక్షుడు ఎస్.దేవానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10వ తేదీన ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతలు అప్పారివెంకటస్వామి, చెన్నుపాటిలక్ష్మయ్య, దాచూరిరామిరెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన యూటీఎఫ్ నాటి నుండి నేటి వరకు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతూ గడిచిన 51 ఏళ్లలో విద్యారంగానికి, ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులను, సౌకర్యాలను సాధించి పెట్టిన ఘనత ఒక్క యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. అప్రెంటిస్ విధానం రద్దు, రీగ్రూపింగ్ స్కేల్స్ సాధన, ఉపాధ్యాయ బదిలీలలో పారదర్శకమైన కౌన్సిలింగ్ విధానం, నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన వంటి వాటిని సాధించడంలో యూటీఎఫ్ పాత్ర గణనీయమైనదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడమే ఏకైక లక్ష్యంగా యూటీఎఫ్ చేపట్టిన పోరాటాలు చారిత్రాత్మకమైనవని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానంద, సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.కంచిరెడ్డి, ఎస్.మస్తాన్‌వలి, ఎస్.బాలయ్య, ప్రసాద్, కె.మురళీక్రిష్ణ, కొండయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు, కమిటీ మెంబర్లు

బద్వేలు అర్బన్ : బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు, కమిటీ మెంబర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం అమ్మవారిశాలవీధిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అట్టహాసంగా జరిగింది. టీటీడీ మాజీ పాలకమండలి సభ్యులు చిప్పగిరిప్రసాద్ నూతన అధ్యక్షులు, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులుగా కొండపల్లిచిన్నసుబ్బారావు, గౌరవాధ్యక్షులుగా కె.రామచంద్రవరప్రసాద్, సెక్రటరీగా ఉరిమిశ్రీనివాసులు, ట్రెజరర్‌గా భూపాలంనాగరాజారావు, ఉపాధ్యక్షులుగా జూటూరునాగరాజ, దర్శిసుబ్బరాజ, మాలేపాటివెంకటేశ్వరరావు, చాటకొండుసత్యనారాయణప్రసాద్, రవికుమార్, యాదాళ్లకృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీలుగా సగళాగోవిందస్వామి, సుబ్బరాయుడు, కృష్ణమూర్తి, సునీల్‌కుమార్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు, కమిటీ మెంబర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కొండపల్లిచిన్నసుబ్బారావు మాట్లాడుతూ అమ్మవారిశాల అభివృద్ధికి, ఆర్యవైశ్యుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుధాకర్ గుప్త, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పి.వెంకటసుబ్బయ్య, ఆర్యవైశ్య మహిళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండపల్లిదేవి, పట్టణ అధ్యక్షురాలు దేవతిలలిత, నాయకులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

శివదర్శనానంద ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు



నూతన కమిటీ సభ్యులతో శివదర్శనానంద సరస్వతి మాతాజీ

ప్రొద్దుటూరు : పట్టణంలోని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శివదర్శనానంద సరస్వతి మాతాజీ తెలిపారు. ట్రస్టుకు సంబంధించి 40 మందితో ఆదివారం నూతన కమిటీ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ ఇక నుంచి ఏడాది పొడవునా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సత్సంగం, ప్రవచనాలు, భక్తి, పూజలు, హోమాలు, యోగా, ధ్యానం, కోటి దీపోత్సవం, బాల చైతన్యం, యువ చైతన్యం, పుస్తక ప్రచురణ, విద్యాసేవా, ఆరోగ్యమే మహాభాగ్యం సేవా, వృక్షోరక్షితః సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు. సభ్యులందరూ ఈ కార్యక్రమాల నిర్వహణకు సహకారం అందించాలని కోరారు.

సంజీవరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ



సంజీవరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బి.కోడూరు : మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి ఇటీవల మోకాలు ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆదివారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా అదే గ్రామంలో ఇండ్ల రామకృష్ణారెడ్డి, ఇండ్ల నారాయణమ్మల కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసానిఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బి.కోడూరు సర్పంచ్ మునిరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సిక్స్ వే రోడ్డు పనులు



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న హ్యూమన్‌రైట్స్ బృందం

పోరుమామిళ్ల : బెంగళూరు నుండి విజయవాడకు నిర్మిస్తున్న ఆరులైన్ల రోడ్డు నిర్మాణం అధ్వానంగా ఉన్నాయని ఆల్ ఇండియా హ్యూమన్‌రైట్స్ నేతలు గంగన్న, ఫణిరావు ఆరోపించారు. ఆదివారం హ్యూమన్‌రైట్స్ బృందం మండలంలోని బొప్పాపురం, పేరమ్మగారిపల్లె వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ ప్రమాణాలను పాటించడం లేదని తెలిపారు. బండరాల్లు వేసి, మట్టితో కప్పెడుతున్నారని ఆరోపించారు. అధికారులు పర్యవేక్షణ లోపించిందని పేర్కొన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు స్పందించకపోతే తాము కోర్టుకు ఆశ్రయిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మైదుకూరు : పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఆదివారం ఆగి ఉన్న వాహనాన్ని బైక్‌పై వెళుతున్న యువకుడు ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పశువుల ఆస్పత్రి సమీపంలో జరిగిన ఈ సంఘటనలో గాయపడిన యువకుడిని చికిత్స కోసం ప్రైవేట్ వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. ఈ యువకుడు చాపాడు మండలం సిద్దారెడ్డిపల్లెకు చెందిన భూషణంగా గుర్తించారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని అర్బన్ పోలీసులు తెలిపారు.